

# విభారె


తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 02 ఫిబ్రవరి 2022 సంపుటి: 03 సంచిక: 151 పేజీలు: 4 వెల: రూ 3-00


# ఆత్మ నిర్భర్ స్ఫూర్తితో భారత్ అడుగులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)కరోనా సమయంలో మరో బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లు ప్రసంగం మొదలుపెట్టారు ఆమె. ఈ ఏడాది వృద్ధి రేటు 9.2 శాతం దాటుతుందని అంచనా. వృద్ధి రేటులో ముందున్నామని నిర్మలా సీతారామన్ ప్రకటించుకున్నారు. వ్యాక్సినేషన్ క్యాంపెయిన్‌జోరుగా సాగుతోంది. కొవిడ్ కట్టడిలో వ్యాక్సినేషన్ కీలకంగా వ్యవహరించిందని పేర్కొన్నారు ఆర్థిక మంత్రి. ఆత్మనిర్భర్ స్ఫూర్తితో ముందుకు సాగనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. వంట నూనె దేశీయంగా తయారీపై దృష్టి. వెయ్యి లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరిస్తామన్నారు. బడ్జెట్ ప్రసంగంలో కీలకాంశాలు కొన్ని.. పీఎం ఆవాస్ యోజన కింద 18 లక్షల ఇళ్లు. 48 వేల కోట్లు కేటాయింపు. 75 జిల్లాలో 75 డిజిటల్ బ్యాంకింగ్ కేంద్రాలు. తృణ ధాన్యాల సంవత్సరంగా 2023. యాప్‌లో ప్రజలకు అందుబాటులో బడ్జెట్. వచ్చే ఐదేళ్లలో మేకిన్ ఇండియాలో భాగంగా 60 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రణాళికగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ప్రకటించారు. ఇంటి ఇంటికి మంచి నీటి కోసం 60 వేల కోట్ల కేటాయింపు.వ్యవసాయ రంగానికి ఆధునిక టెక్నాలజీని ఉపయోగం, భూ రికార్డులను డిజిటలైజేషన్. డ్రోన్‌లతో పంట పొలాల పరిరక్షణ. సేంద్రీయ వ్యవసాయానికి ప్రత్యేక రాయితీల ప్రకటన. పీఎం ఈ విద్య కోసం 200 ఛానెల్స్. ప్రాంతీయ భాషల్లో విద్యాబోధన.. 1.12 తరగతులకు వర్తింపు. ఆతిథ్య రంగానికి రూ. 5 లక్షల కోట్ల కేటాయింపులు. మైక్రో, చిన్నతరహా కంపెనీలకు 2 లక్షల కోట్ల కేటాయింపులు. ఎంఎస్ ప్రత్యేకంగా డిజిటల్ యూనివర్సిటీ. స్టార్టప్‌లకు 2 లక్షల కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో 4 మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు. అంగన్‌వాడీ 2.0 కింద 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ. తెలుగు స్టేట్స్‌లో నదుల అనుసంధానంపై ప్రణాళిక. త్వరలో కృష్ణ గోదావరి, కృష్ణ పెన్నా నదుల అనుసంధానం. పెన్నా-కావేరి నదుల అనుసంధానానికి ప్లాన్. గంగా నదీ తీరంలో 5 కిలోమీటర్ల? మేర సేంద్రీయ సాగు.అన్ని పోస్టాఫీసుల్లో బ్యాంకింగ్ సేవలు(నెట్‌బ్యాంకింగ్, ఏటీఎం సహా) అందుబాటులోకి. ఇకపై చిప్ ఆధారిత పాస్ పోర్టులు. కొత్తగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0డిజిటల్ పేమెంట్, నెట్‌బ్యాంకింగ్ సేవలకు ప్రోత్సాహకాలు. గతిశక్తి కార్గో టెర్మినళ్ల నిర్మాణం. కొత్త రహదారుల నిర్మాణం. పేద, మధ్య తరగతి సాధికారికత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2022 నాటికి 5జీ స్పెక్ట్రం వేలం పూర్తి చేసే యోచన. 2023 నుంచి 5జీ సేవలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం. ప్రజా రవాణాలో ప్రత్యామ్నాయ ఇంధనలకు ప్రముఖ స్థానం. ఈ-వెహికల్స్ ప్రోత్సహకంలో భాగంగా హైవేలపై బ్యాటరీలు మార్చుకునే సదుపాయం. సోలార్ ఎనర్జీ ఉత్పత్తి కోసం 19,500 వేల కోట్ల రూ. కేటాయింపు.అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కాగిత రహిత విధానం. మానసిక ఆరోగ? వ్యవస్థ కోసం జాతీయ విధానం. 10 రంగాల్లో క్లీన్‌ఎనర్జీ యాక్షన్ ప్లాన్. ఎగుమతుల ప్రోత్సాహకానికి కొత్త చట్టం. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక స్టార్టప్‌లు.

ఎక్కడి నుంచి ఎక్కడైనాకేంద్రం నూతన భూ సంస్కరణలు తీసుకొచ్చింది. దీనికి సంబంధించి విషయాలను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఏకీకృత రిజిస్ట్రేషన్ పథకాన్ని(ఔఉఆఖీ) ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడి నుంచైనా భూములు రిజిస్ట్రేషన్? చేసుకునేందుకు ఆధునిక వ్యవస్థను తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా

### ఎక్కడి నుంచైనా భూమి రిజిస్ట్రేషన్

డీడ్‌లు, రిజిస్ట్రేషన్లకు ఆధునిక వ్యవస్థ తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి 75,000 ఒప్పందాలు తొలగించామని, 1,486 యూనియన్ చట్టాలను కూడా రద్దు చేసినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. చెల్లింపులలో జాప్యాన్ని తగ్గించడానికి అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలకు ఆన్‌లైన్ బిల్లు చెల్లింపు వ్యవస్థ గురించి కూడా సీతారామన్ మాట్లాడారు. ఎంటర్‌ప్రైజ్, హబ్‌ల అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని ఆమె తన బడ్జెట్ 2022 ప్రసంగంలో ప్రతిపాదించారు. ఈ కొత్త చట్టం ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక ప్రాంతాలను కవర్ చేస్తుందని, ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు.

80 లక్షల ఇళ్లుపేదలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గూడ్ న్యూస్ చెప్పారు. తన బడ్జెట్ 2022 ప్రసంగంలో 2022-23లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పీఎం ఆవాస్ యోజనకు అర్హులైన లబ్ధిదారుల కోసం 80 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.48,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు భూమి, నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతుల సమయాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తుందన్నారు.అందరికీ గృహాలు" అందించాలనే లక్ష్యాన్ని సాధించడానికి, భారత ప్రభుత్వం గ్రామీణ గృహనిర్మాణ పథకాన్ని రూపొందించిందన్నారు. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-గ్రామిన్ (ఖఓంజ-ఉ) నవంబర్ 20, 2016న ప్రారంభించారు. ఏప్రిల్ 1, 2016 నుంచి అమలులోకి వస్తుంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన అర్బన్ (ఖఓంజ-ఞ) 25 జూన్ 2020 నాటికి ఐదేళ్లు పూర్తయింది.ఏప్రిల్ 1న ప్రారంభం కానున్న ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ 2022 కేంద్ర బడ్జెట్‌ను మంగళవారం సమర్పించారు. ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ 7.3 సంకోచం తర్వాత మార్చి 31తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9.2 శాతం వృద్ధి చెందుతుందని అంచనా.

# ఇది పేదల బడ్జెట్.. అభివృద్ధిపై నమ్మకాన్ని తెచ్చింది -ప్రధాని మోదీ



సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వందేళ్ల భయంకరమైన విపత్తుల మధ్య ఈ బడ్జెట్ అభివృద్ధిపై నమ్మకాన్ని తీసుకొచ్చిందని అభిప్రాయపడ్డారు మోదీ. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సామాన్యులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని అన్నారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, అభివృద్ధి, కొత్త ఉద్యోగ అవకాశాలతో ఈ బడ్జెట్ నిండుగా ఉందని అన్నారు మోదీ. దేశంలోనే తొలిసారిగా హిమాచల్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాలకు పర్వతమాల పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ ప్రణాళికతో పర్వతాలపై ఆధునిక రవాణా వ్యవస్థ ఏర్పడుతుందని అన్నారు. ఈ బడ్జెట్ మరిన్ని మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, అభివృద్ధి వంటి కొత్త అవకాశాలతో సంపూర్ణంగా ఉందని అన్నారు. ఈ బడ్జెట్‌లో పేదల సంక్షేమమే ముఖ్యమని, ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు, కుళాయి నీళ్లు, టాయిలెట్, గ్యాస్ సౌకర్యం, వీటన్నింటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ప్రధాని మోదీ చెప్పారు. ఆధునిక ఇంటర్నెట్ కనెక్టివిటీకి సమాన ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. భారత ప్రజల విశ్వాసం, గంగామాత పరిశుభ్రతతో పాటు రైతుల సంక్షేమం కోసం ప్రణాళికలు వేసినట్లు చెప్పారు. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ఈ ఐదు రాష్ట్రాల్లో గంగా తీరం వెంబడి సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు. అదేవిధంగా ఈ బడ్జెట్‌లో రక్షణ మూలధనం నుంచి 68శాతం దేశీయ పరిశ్రమకు కేటాయించడం వల్ల భారతదేశంలో ఓటఇ రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పీపుల్ ఫ్రెండ్లీ, ప్రోగ్రెసివ్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆమె బృందాన్ని అభినందిస్తున్నాను" అని అన్నారు. ఈ బడ్జెట్ యువతకు ఉజ్వల భవిష్యత్తు ఇస్తుందని అన్నారు.

# క్లాప్ పథకం పై జగన్ సమీక్ష



విజయవాడ, ఫిబ్రవరి 1 పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై కీలక సమీక్ష నిర్వహించారు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఈ రివ్యూ సందర్భంగా గత ప్రభుత్వంపై సీరియస్ కామెంట్స్ చేశారు ముఖ్యమంత్రి. రాష్ట్రంలోని జగనన్న కాలనీల్లో సురక్షిత మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి జగన్. ఉపాధి హామీ పనుల్లో భాగంగా, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లీనిక్?లు, డిజిటల్ లైబ్రరీలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు సీఎం. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష నిర్వహించారు సీఎం జగన్. ఉపాధి హామీ పథకం పనులు, వైఎస్ఆర్ జలకళ, గ్రామీణ ప్రాంతాల్లో క్లాప్ కింద పరిశుభ్రత కార్యాక్రమాలపై సమీక్షించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన రహదారుల మరమ్మతులు, నిర్మాణాలను ఇప్పుడు పూర్తి చేయాల్సి వస్తోందన్నారు ముఖ్యమంత్రి జగన్. రెండేళ్లుగా భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు ముఖ్యమంత్రి. అమూల్ పాలసేకరణ చేస్తున్న జిల్లాలను, ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని లను పూర్తిచేయాలన్నారు సీఎం.నవంబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో 22 శాతం ఇళ్ల నుంచి చెత్తసేకరణ ప్రారంభమై, ప్రస్తుతం 61 శాతానికి చేరుకున్నామని ముఖ్యమంత్రికి వివరించారు అధికారులు. అక్టోబరు కల్లా పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు. సాయిల్ బయోట్రీట్‌మెంట్, వెట్ ల్యాండ్‌ట్రీట్‌మెంట్, వేస్ట్ స్టెబిలైజేషన్ పాండ్స్ తదితర పద్ధతుల్లో శుద్ధికి రూపొందించిన ప్రణాళికను సీఎంకు వివరించారు అధికారులు. పాదయాత్రలో గ్రామాల్లో పరిస్థితులు చూపినప్పుడు ఆవేదన కలిగిందన్నారు సీఎం జగన్. అలాంటి పరిస్థితులను మార్చాలని అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండే పరిస్థితులు ఉండకూడదన్న ముఖ్యమంత్రి, మెరుగైన జీవన ప్రమాణాలు అందాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ల ఏర్పాటుపైనా దృష్టిపెట్టాలని ఆదేశించారు ముఖ్యమంత్రి జగన్.

## అందంతా అవాస్తవం.. అవినీతికి ఆస్కారం లేదు: మంత్రి సురేష్

అమరావతి: ప్రభుత్వంపై పనిగట్టుకుని అవాస్తవ ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం ఏపీ సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెడుతున్నామని.. విద్యార్థులకు చిక్కీలు, గుడ్లు అందిస్తున్నామన్నారు. వీటి పై టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అక్రమాలన్న వారికి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యార్థులకు చిక్కీలు కోసం రూ.350 కోట్లు ఖర్చు చేశామన్నారు. రివర్స్ టెండరింగ్ ద్వారా ప్రజాధనం ఆదా చేశామని పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి అవినీతికి ఆస్కారమే లేదని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఎక్కువ మొత్తంతో చిక్కీలు కొన్నాం. కానీ దానిని కూడా అవినీతి అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సురేష్ నిప్పులు చెరిగారు.



## దేశంలో కొత్తగా 1,67,059 కోవిడ్ కేసులు నమోదు

దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య నిన్న కాస్త తగ్గుముఖం పట్టింది. దేశవ్యాప్తంగా సోమవారం 1,67,059 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి.దీంతో దేశంలో మొత్తం కోవిడ్ కేసుల సంఖ్య 4,14,69,499 కు చేరింది. ప్రస్తుతం దేశంలో 17,43,059 యాక్టివ్ కరోనా కేసులు ఉన్నాయి. దేశంలో కోవిడ్ పాజిటివిటి రేటు 96.62 శాతంగా ఉంది.దేశంలో తాజాగా 1,192 మంది కోవిడ్ తదితర కారణాలతో మరణించగా?ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య 4,96,242 కి చేరింది. నిన్న కోవిడ్ నుంచి 2,54,076 మంది కోలుకున్నారు. ఇక దేశ వ్యాప్తంగా రికవరీల సంఖ్య 3,92,30,198 కు చేరింది.ఇక రోజు వారి కరోనా పాజివిటి శాతం 11.69% గా నమోదు అయింది. ఇండియాలో యాక్టివ్ కరోనా కేసులు 4.20% గా నమోదు అయింది. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 1,66,68,48,204 మందికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కోవిడ్ వ్యాక్సిన్లు వేసింది. నిన్న ఒక్కరోజు దేశంలో 61 లక్షల మందికి వ్యాక్సిన్ వేశారు.

## హైకోర్టు సలహాను పరిగణలోకి తీసుకోవాలి: సజ్జల

అమరావతి: ఉద్యోగులకు అన్యాయం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నా రు. మంగళవారం.. మంత్రుల కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ, అన్ని జేఏసీ నేతలు చర్చలకు వచ్చారని.. ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ లేదన్నారు.ఉద్యోగుల కార్యాచరణను వాయిదా వేయమని కోరామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమకు ఎవరికీ అన్యాయం చేయాలని లేద న్నారు. హైకోర్టు సలహాను ఉద్యోగ సంఘా లు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇది పాజిటివ్ చర్చగానే తాము భావిస్తున్నామని సజ్జల పేర్కొన్నారు. కాగా, ఉద్యోగుల డిమాండ్లపై మళ్లీ చర్చిస్తామని మంత్రుల కమిటీ తెలిపింది.



# ఉద్యోగులు కార్యాచరణను వాయిదా వేయాలి

### పీఆర్సీ ప్రకారమేజీతాలు ఉంటాయని స్పష్టీకరణ
### హైకోర్టు సలహాను వారు పాటించాలి: సజ్జల
### ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రుల కమిటీ చర్చలు



అమరావతి,ఫిబ్రవరి1: ఉద్యోగులకు అన్యాయం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వారు చర్చలకు వస్తే చర్చించి తగు న్యాయం చేయడానికి సిద్దంగా ఉన్నామని అన్నారు. మంగళవారం.. మంత్రుల కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్ని జేఏసీ నేతలు చర్చలకు వచ్చారని.. అని అంశాలపై చర్చించామని ఆయన తెలిపారు. ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ లేదన్నారు. ఉద్యోగుల కార్యాచరణను వాయిదా వేయమని కోరామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమకు ఎవరికీ అన్యాయం చేయాలని లేదన్నారు. హైకోర్టు సలహాను ఉద్యోగ సంఘాలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇది పాజిటివ్ చర్చగానే తాము భావిస్తున్నామని సజ్జల పేర్కొన్నారు. కాగా, ఉద్యోగుల డిమాండ్లపై మళ్లీ చర్చిస్తామని మంత్రుల కమిటీ తెలిపింది. మంత్రుల కమిటీతో చర్చలకు హాజరు కాబోమని పట్టుబట్టిన ఉద్యోగ సంఘాలు పట్టువిడుపు ప్రదర్శించాయి. ఈ మేరకు మంగళవారం మంత్రుల కమిటీతో పీఆర్సీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చర్చల్లో పాల్గొన్నారు. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, బొత్స సత్యనారాయణలతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలు ఈ సమవేశంలో పాల్గొనగా, పీఆర్సీ స్టీరింగ్ కమిటీ నుంచి వెంకట్రామిరెడ్డి, కె ఆర్ సూర్యనారాయణ, బొప్పరాజు, బండి శ్రీనివాస్ చర్చల్లో పాల్గొన్నారు. పీఆర్సీ ప్రకారం జీతాలు పడుతున్న వేళ పాత జీతాలు వేయడం ఎలా సాధ్యమని ఉద్యోగ సంఘాలను ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులతో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగసంఘాల ప్రతిపాదనలను అంశాలవారీగా పరిశీలిస్తామని ఆయన తెలిపారు. జీతాలు పడుతున్న వేళ పాత జీతాలు వేయడం ఎలా సాధ్యమన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరామని ఆయన తెలిపారు. చర్చల సమయంలో ఉద్యమం అంటే ప్రతిష్టంభన ఏర్పడుతుందన్నారు. చలో విజయవాడ కార్యక్రమం కొనసాగుతుందని వారు చెప్పారన్నారు. ఉద్యోగుల కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకోదన్నారు. కరోనా నిబంధనలను ఉద్యోగసంఘాలు గుర్తుంచు కోవాలన్నారు. చలో విజయవాడ కార్యక్రమం కంటే ముందే సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు. జీతాల్లో ఎక్కడా రికవరీ లేదన్నారు. ఐఆర్ అనేది తాత్కాలిక అడ్జస్ట్‌మెంట్ మాత్రమేనని ఆయన తెలిపారు. అది రీ అడ్జస్ట్ అవుతుందని,దాన్ని రికవరీగా చూడొద్దన్నారు. ఉద్యోగ సంఘాల నేతలను మంత్రులు బెదిరిస్తున్నారనడం అవాస్తవమన్నారు.

# తగ్గిన గ్యాస్ సిలెండర్

హైదరాబాద్, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)సామాన్యులకు ఫిబ్రవరి 1న గుడ్ న్యూస్ అందింది. ఎల్పీజీ సిలిండర్ ధరలు భారీగా తగ్గాయి. దీంతో సామాన్యులకు గ్యాస్ ధరలలో ఊరటనిచ్చింది. చమురు కంపెనీలు వాణిజ్య గ్యాస్ సిలండర్ రేట్లను తగ్గించాయి. ఫిబ్రవరి నెలారంభంలో సామాన్యులకు శుభవార్త అందించాయి చమురు సంస్థలు. అయితే ఈ ప్రయోజనం కేవలం కొంత మందికి మాత్రమే వర్తిస్తుంది. కంపెనీలు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను మాత్రమే తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో కొందరికి మాత్రమే ఈ ధరలు వర్తించనున్నాయి.చమురు సంస్థలు 14.2 కేజీల సిలిండర్ ధరను మార్చలేదు. దీంతో ఎల్పీజీ సిలిండర్ల ధరలో ఎలాంటి మార్పు లేదు. దీనివలన వీరికి ఎలాంటి ఊరట లేదు. ఇక ఇండియన్ ఆయి 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను రూ. 91.5 తగ్గించింది. ధర తగ్గించిన తర్వాత ఢిల్లీలో 19 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ. 1907గా చేరింది. ఈనెలలో గ్యాస్ ధరలు పెరగలేదు.

# సంపాదకీయం

బుధవారం 02 ఫిబ్రవరి 2022

## ఇక భవిష్యత్తు అమృత కాలమే....

వచ్చే 25 ఏళ్ల అమృతకాలానికి ఈ బడ్జెట్ పునాదిపారదర్శకమైన సమీకృత అభివృద్ధికి ఈ బడ్జెట్ నాంది కానుందని బడ్జెట్ పద్దును ప్రవేశ పెడుతూ నిర్మలమ్మ తొలి మాటలు ఇవి. అయితే అమృతకాలం బడ్జెట్ అంటూ... ప్రభుత్వ సంస్థలను వరుస బెట్టి అమ్మకాల లిస్ట్ను మంత్రి వెల్లడించారు. డీబీటీ ద్వారా పేదలకు నేరుగా ఆర్థికసాయం లభిస్తుందన్నారు. గృహనిర్మాణం, వసతుల కల్పన, తాగునీరు కల్పనలో దేశం వేగంగా ముందుకెళ్తోందన్నారు. ఆజాదీ కా అమృతోత్సవ్ పరుగు ప్రారంభమైందన్నారు. వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను అగ్రదేశంగా నిలబెట్టేందుకు ప్రణాళికలు రెడీ చేసినట్లుగా చెప్పారు. కొవిడ్ కట్టడిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం బాగా కలిసొచ్చిందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో టీకా కీలకపాత్ర పోషించిందని వెల్లడించారు.నిర్మలా సీతారామన్? ప్రసంగంలో పలు కీలక విషయాలను వెల్లడించారు. ఉత్పత్తి ఆధార ప్రోత్సాహకాలు 14 రంగాల్లో మంచి అభివృద్ధి కనిపించిందన్నారు. వచ్చే ఐదేళ్లలో 13 లక్షల కోట్ల ఉత్పాదకతకు తగిన ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. నీలాంచల్ నిస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ను ప్రైవేటు పరం చేశామన్నారు. త్వరలో ఎల్ఐసీ పబ్లిక్ ఇష్యూ రాబోతుందన్నారు.దేశంలోని రైతుల సంక్షేమానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పథకాలు ప్రకటించారు. పార్లమెంటులో మంగళవారం తన బడ్జెట్ ప్రసంగంలో రైతుల కోసం పలు పథకాలకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా మంత్రి ప్రకటించారు. భారతదేశంలోని రైతులకు రసాయన రహిత సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని నిర్మలా సీతారామన్ చెప్పారు. పంట అంచనా, భూ రికార్డుల డిజిటలైజేషన్, క్రిమిసంహారక మందుల పిచికారీ కోసం కిసాన్ డ్రోన్‌లను వినియోగిస్తామని మంత్రి పేర్కొన్నారు.. 2.37 లక్షల కోట్ల రూపాయలను ఎంఎస్‌పిని నేరుగా రైతులకు చెల్లిస్తామని సీతారామన్ చెప్పారు.ఆతిథ్య రంగం పునరుజ్జీవం కోసం కృషి చేస్తామన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో అదనంగా రూ.2 లక్షల కోట్ల క్రెడిట్ సదుపాయం కల్పిస్తామన్నారు. స్టార్టప్ కంపెనీలను 'డ్రోన్ శక్తి' ద్వారా ప్రోత్సహిస్తామని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీకి ఈ బడ్జెట్‌లో గట్టి ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యా రంగానికి ప్రోత్సాహంలో భాగంగా 200 టీవీ చానళ్ళకు ఈ-విద్యను విస్తరిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలకు ఈ-కంటెంట్ డెలివరీని ప్రోత్సహిస్తామన్నారు. విద్యార్థుల కోసం డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్, నేషనల్ టెలీ హెల్త్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తామన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో నూతన తరం అంగన్వాడీల ఏర్పాటు చేస్తామని, 2 లక్షల అంగన్వాడీలను అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. 2023 నాటికి పీఎం ఆవాస్ యోజన క్రింద బలహీన వర్గాలకు చెందిన 80 లక్షల మందికి గృహాలను నిర్మిస్తామని చెప్పారు. ఎన్డీఏ సర్కారు ఈ సారి కొత్త రైళ్లు ప్రవేశపెట్టడంపై దృష్టి సారించింది. మోదీ సర్కార్ కొలువుదీరిన తర్వాత కొత్త రైళ్లు స్టార్ చేయడం కంటే నూతన రైల్వేలైన్ల నిర్మాణం, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులపై ఎక్కువగా ఫోకస్ చేశారు. గతానికి భిన్నంగా వందే భారత్ పేరుతో భారీగా రైళ్లు ప్రవేశపెట్టబోతున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇప్పటికే వరుసగా 75 వారాల పాటు 75 వందే భారత్ రైళ్లను నడిపిస్తామని పీఎం మోదీ ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా ఆర్థిక మంత్రి ప్రకటన వచ్చింది.కొత్తగా వచ్చే వందే భారత్ రైళ్లను పూర్తిగా లింకే హాఫ్ మన్ బుష్ (ఎల్ఎఫ్‌బీ) కోచ్‌లతో రూపొందించబోతున్నారు. ప్రస్తుతం రాయ్‌బరేలీ, కపుర్తాల, చెన్నైలలో ఉన్న కోచ్ ఫ్యాక్టరీలలో ఎల్ఎఫ్‌బీ కోచ్‌లను తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని పలు నగరాల నంచి దేశరాజధానికి వందే భారత్ రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా వచ్చే రైళ్లలో తెలంగాణ, ఏపీకి వాటా దక్కనుంది.ఇక వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైల్వే నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తామని మంత్రి ప్రకటించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఇప్పటి వరకు ఎరువుల సరఫరాకే రైల్వే నెట్‌వర్క్ ఉపయోగపడుతోంది. కరోనా సంక్షోభం వచ్చాక రైళ్ల ద్వారా వ్యవసాయ ఉత్పత???తుల రవాణా పెద్ద ఎత్తున చేపట్టారు. వీటి ఫలితాలు బాగుండటంతో ఈసారి చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే కార్గో సేవలు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు పీఎం గతి శక్తి ద్వారా దేశవ్యాప్తంగా వంద కార్గో టెర్మినల్స్ నిర్మించబోతున్నారు.

## అనంతలో చిన్న పరిశ్రమలపై చిన్న చూపు

అనంతపురం, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల నిర్వహణ కడుదయనీయ స్థితికి చేరింది. మూడు సంత్సరాలలో చిన్న తరహా పరిశ్రమలకు ఎలాంటి ప్రోత్సాహకాలు లేని పరిస్థితి. బడా కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వం చిరు పరిశ్రమలపై దృష్టి సారించటం లేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కరువు ప్రాంతంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో రాష్ట్ర విభజన ప్రస్తావన ముందుకు తెచ్చిన నాటి నుంచి పరిశ్రమలకు గడ్డుకాలం ఏర్పడిందనేది వాస్తవం. జిల్లాలో పదుల సంఖ్యలో పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. అసలే వ్యవసాయ ఆధారిత జిల్లా కావటంతో పరిశ్రమలు శాతం తక్కువగా ఉంది. ఉన్న పరిశ్రమలకు సరైన ప్రోత్సాహం లేకపోవటంతో ఔత్సాహికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపుగా 1000కి పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా పరిశ్రమల నిర్వహణ దయనీయ స్థితికి చేరిందని పరిశ్రమల యాజమానుల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. జిల్లాలో ప్రముఖంగా గ్రానైట్ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. సోప్స్, ఫార్మా, కర్పూరం, ఐరన్‌ఒర్, ఐరన్ బేసుడ్ పరిశ్రమలు, పివిసి, డ్రిప్ పరికరాల ఉత్పత్తి కేంద్రాలు, జీన్స్ ప్యాంట్ల ఉత్పత్తి కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, పాల ఉత్పత్తి కేంద్రాలు ఇలా పలు రకాల యూనిట్లు జిల్లాలో ఉన్నాయి. ప్రధానంగా హిందూపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాలలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. పరిశ్రమలు రాష్ట్ర విభజనతో మరింత నష్టాల్లోకి వెళ్లాయి. రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టినప్పటి నుంచి చిన్నతరహా పరిశ్రమలకు ఎలాంటి ప్రోత్సాహకాలు దక్కలేదు. మరో వైపు కేంద్రం ప్రభుత్వం నోట్ల రద్దు, జిఎస్‌టిని ముందుకు తీసుకురావటంతో యావత్తు పారిశ్రామిక రంగం కుదేలయింది.

గతంలో వ్యాట్ యాక్టు లేని కారణంగా ఇన్సెంటివ్‌లు ఆశాజనకంగా ఉండేవని సేల్‌టాక్స్ రీయింబర్స్‌మెంట్ విధానం ప్రోత్సాహకంగా ఉండేది. ప్రస్తుతం జిఎస్‌టి విధానంలో జరిగిన మార్పుల వల్ల పరిశ్రమల రంగంలో ఆందోళన నెలకొంది. ఏడాది గడిచినా నేటికీ ప్రభుత్వం జీవో విడుదల చేయకపోవటంతో ఎంతో మంది ఔత్సాహికులు ఎదురుచూస్తున్నారు. మరో వైపు చిన్న తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ ఇతర రాయితీలను మరింత పెంచితేనే వెనుకబడిన ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. మరో వైపు మర్కెటింగ్ సౌకర్యం లేకపోవటంతో పారిశ్రామిక వేత్తలు రవాణా భారాలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం మర్కెటింగ్ సౌకర్యంపై దృష్టి సారిస్తేనే చిరు పరిశ్రమల మనుగడ సాధ్యమవుతుందని కొందరు పారిశ్రామిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు

## సర్కారీ ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఫిజియోథెరఫి మిషన్లు

కడప, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)ప్రభుత్వ ఆస్పత్రులో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ యంత్రాలు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించే పరిస్థితి మచ్చుకైనా కనిపించడంలేదు. వాటి ద్వారా సేవలందించే నిపుణులు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి కొన్న యంత్రాలు పని లేకపోవడంతో మూలన చేరుతున్న వైనం జిల్లాలో కనిపిస్తోంది. ప్రభుత్వం వైద్యులను నియమించకపోవడంతో పరిస్థితి తలెత్తుతోంది. పేదలకు ఈ సేవలు అందని ద్రాక్షలా మారుతున్నాయి. ఎముకల బెణుకులు, విరుపులు కండరాల నొప్పులు, మోకాళ్ల నొప్పులుతో బాధపడే రోగులకు ఉపశమనం కలిగించడానికి వీలుగా ఫిజియోథెరపీ వైద్యాన్ని రోగులు ఆశ్రయిస్తారు. ఈ సేవలను అందించడానికి వీలుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫిజియోథెరపీ పరికరాలు, యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫిజియోథెరపీ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటికోసం దాదాపు రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షలు దాకా వెచ్చించారు. వీటిని నిర్వహించడానికి ప్రత్యేకంగా ఫిజియోథెరపీలో నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించాలి. ప్రభుత్వం యంత్రాలనైతే ఏర్పాటు చేసింది కాని వైద్యుల ఏర్పాటు అంశాన్ని పూర్తిగా విస్మరించింది. గత సంవత్సరమే వైద్యులను నియమించడానికి కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ ఫలించలేదు. వైద్యులు లేకపోవడంతో యంత్రాలను నిర్వహించే నాథుడు కరువవుతున్నారు. పరికరాలు అందుబాటులో ఉన్నా పని జరగడం లేదు. రూ. లక్షలు విలువ చేసే పరికరాలు మూలన చేరుతున్నాయి.ప్రభుత్వాసుపత్రుల్లో ఫిజియోథెరపి సేవలు పేదలకు అందని ద్రాక్షగా మారుతున్నాయి.

చాలా మంది పేదలు ఆస్పత్రులకు ఈ సేవలను పొందడానికి వస్తుంటారు. వచ్చిన వారికి సేవలు అందడంలేదని తెలిసి ఉస్సురుమంటున్నారు. ఇక్కడ సేవలు అందకపోవడంతో ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. వీటిలో ఈ సేవలను పొందడానికి దాదాపు రోజుకు 350 నుంచి రూ. 500 వరకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. సాధారణ ప్రజలకు ఇది ఏమాత్రం సాధ్యపడడం లేదు. ఒకింత ఆర్థిక స్థోమత కలిగిన వారు మాత్రమే ప్రయివేటు ఆస్పత్రులకు వెలుతున్నారు. ఆ స్థోమత లేనివారు బాధలను దిగమింగుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వైద్యులను నియమించి సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## నెల్లూరులో వర్గ విబేధాలు

నెల్లూరు, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్) రాజకీయ చైతన్యం ఉన్న నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ పరిస్థితి ఎలా ఉంది? గత ఏడాది జరిగిన ఎన్నికల్లో జిల్లా మొత్తం క్లీన్ స్వీప్ చేసిన వైసీపీలో ఇప్పుడు ఎలాంటి వాతావరణం ఉంది ? అన్నది పరిశీలిస్తే ఎన్నికల్లో జిల్లాలో టోటల్‌గా క్లీన్‌స్వీప్ చేసేసి టీడీపీ అడ్రస్ గల్లంతు చేసిన వైసీపీలో ఇప్పుడు అంతే రేంజ్‌లో గ్రూపుల గోల కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు. ఇక్కడ ఎవరికి వారు వర్గాలుగా ఏర్పడి తమ తమ రాజకీయాలు చేసుకుంటున్నారని అంటున్నారు. ముఖ్యంగా ఈ జిల్లా నుంచి ఇద్దరు కీలక నాయకులకు జగన్ తన కేబినెట్‌లో మంత్రి పదవులు ఇచ్చారు. వీరిలో ఒకరు మేకపాటి గౌతంరెడ్డికాగా, మరొకరు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్.ఈ ఇద్దరిలోనూ ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్న పేరు అనిల్. దూకుడు విషయంలోనూ, గ్రూపుల విషయం లోనూ అనిల్ తన దారిలో తాను వెళ్తున్నారని అంటున్నారు. ఇక, గ్రూపుల విషయానికి వస్తే.. మంత్రి అనిల్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఒకే వర్గంగా ముందుకు సాగుతున్నారు. ఇక, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్‌రెడ్డిలు ఒక వర్గంగా వ్యవహరిస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సైతం కాస్త వ్యక్తిగతంగా ఉన్నట్టు ఉన్నా టైం వస్తే ఈ గ్రూపుతోనే ఉంటారన్న టాక్ ఉంది. వీరంతా మంత్రి అనిల్ కుమార్ యాదవ్ టార్గెట్‌గానే రాజకీయం నడుపుతున్నారు. అనిల్ పేరు చెపితేనే వీళ్లంగా అగ్గిమీద గుగ్గిలమయ్యే పరిస్థితి నెలకొంది.మరోపక్క, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే, మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డికి ఒకే కుటుంబం కావడంతో ఈ ఇద్దరూ కూడా ఒకే గ్రూపుగా వ్యవహరిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. జిల్లా రాజకీయాల్లో మేకపాటి వర్గానికి ఎప్పుడూ సపరేట్ గ్రూపే. దీంతో జిల్లా వైసీపీలో మూడు గ్రూపుల రాజకీయం నడుస్తోందని అంటున్నారు పరిశీలకులు.

ఇవన్నీ ఇలా ఉంటే మంత్రి అనిల్ కుమార్ యాదవ్ గురించి మరింతగా ప్రచారం జరుగుతోంది.రెండు వర్గాలు ఎవరికి వారు అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఇసుక మాఫియా పెరిగిపోవడం, దూకుడు రాజకీయాలతో పాటు అనిల్ ఓ వర్గానికి యాంటీ అన్న ముద్ర బయటకు రావడంతో వాటిపై జగన్ సీరియస్‌గా ఉన్నారని అంటున్నారు. అదే సమయంలో తనకంటూ ఒక వర్గం ఏర్పాటు చేసుకుని, మిగిలిన వారిని దూరం పెట్టడం, మిగిలిన నాయకులతో కయ్యం పెట్టుకోవడం వంటివికూడా అనిల్‌ను వివాదంగా మారుస్తున్నాయని అంటున్నారు. ప్రస్తుతం అనిల్‌ను విభేదించే వారి సంఖ్య పెరిగినా మంత్రిగా అనిల్ జిల్లాలో బలమైన రెడ్డి సామాజిక వర్గంపై పైచేయి సాధించి ఆధిపత్యం చలాయిస్తున్నారని, వారికి అంగుళం అంత అవకాశం కూడా ఇవ్వడం లేదని అంటున్నారు. సో మొత్తంగా నెల్లూరులో వైసీపీ పరిస్థితి మూడు గ్రూపులు. నాలుగు వివాదాలుగా నడుస్తోందనడంలో సందేహం లేదు.

## అప్పులతో కుదేలవుతున్న రైతులు



అనంతపురం, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)ఏ ప్రభుత్వమెచ్చినా చెప్పే మాటలు తాము రైతుపక్ష పాతులమని. వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబెతూనే ఉంటారు. అయితే ఆచరణలో చూస్తే రైతాంగం ఆత్మహత్యలు ఆగడం లేదు. ఈ వారం రోజుల్లో ఇద్దరు రైతులు రుణపాశానికి బలయ్యారు. కనగానపల్లి, బుక్కపట్నం రెండు మండలాల్లోనూ ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోయారు. వారి మరణానికి కారణం ఒక్కటే. అప్పుల బాధలే ఉన్నాయి. వేసిన పంటలు చేతికందకపోవడం, సరైన గిట్టుబాటు ధర లేకపోవడం కారణాలని చెప్పవచ్చు. ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా రాజధాని మార్పు సందర్భంగా పెద్దఎత్తున రాష్ట్రాభివృద్ధిపైన చర్చలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే రాయలసీమ ప్రాంతాభివృద్ధి ప్రస్తావన సాగుతోంది. అయితే ఈ చర్యలు, రాజకీయాలు ఏవి ఆత్మహత్య చేసుకుని చనిపోతున్న రైతుల సమస్యలపై లేకపోవడం విచారకరం. రైతుల ఆత్మహత్యలు చూసినప్పుడు దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలు మొదలైనప్పటి నుంచి ప్రారంభమయ్యాయి. 1990 నుంచి ఇప్పటి వరకు రైతాంగ ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారికంగానే వెయ్యి మందికిపైగా ఈ సంఖ్య చేరింది. ఇక అనధికారికంగా మూడింతలు సంఖ్య ఉంటుందన్నది లెక్క. ఇంతటి తీవ్రమైన పరిస్థితులు జిల్లాలో నెలకొని ఉన్నాయి. వీటి నిలువరిస్తామని పాలకులు చెప్పడం మినహా నిజంగా వాటి నివారణకు తీసుకున్న చర్యలేవి ఉండడం లేదు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. రూ.2700 కోట్లు రుణమాఫీ అని వెయ్యి కోట్ల వరకు చేసి, తక్కినవి చేస్తామంటూనే ఐదేళ్ల కాలం గడిపేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ అప్పులను మాఫీ చేయలేమని చెతులెత్తేసింది. కనీసం 2018లో జరిగిన పంటనష్టానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ అయినా ఇస్తుందని అందరూ ఎదురు చూశారు. అవి కూడా వెయ్యి కోట్లకుపైగా రావాల్సి ఉంది. కాని ఇస్తామంటూనే ఏడు మాసాలు గడిపేసింది. కేవలం తొమ్మిది వేలు రైతుల ఖాతాల్లో జమ చేసి ఇదే రైతుకు తామిచ్చే 'రైతు భరోసా' అని గొప్పలు చెప్పుకుంటోంది. 2019వ సంవత్సరంలోనూ సకాలంలో వర్షాలు రాలేదు. అదును తప్పి రావడంతో వర్షాధార పంటలు పూర్తి స్థాయిలో సాగవ లేదు. రబీలో వేసిన పప్పుశనగ పంట దిగుబడి కూడా బాగా తగ్గింది. ఈ రకంగా రైతులు కష్టాల్లో నుంచి గట్టెక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వాలు ఆదుకుంటామని చెప్పడం, ఆచరణలో రిక్తహస్తాలు చూపించడం జరుగుతూనే ఉంది. ఇక అధికార,ప్రతిపక్ష పార్టీలు రెండు కూడా ప్రధాన సమస్యలపై కాకుండా రాజధాని అమరావతిలో ఉండాలా, వద్దా అన్న దానిపైనే విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ తమ పార్టీ అధినేతల దృష్టిలో పండేందుకే తాపత్రయపడుతుండటం శోచనీయం. ఈ వారం రోజులు రాజధాని మార్పుపై అసెంబ్లిలో జరుగుతున్న పరిణామాలకు అనుగుణంగా టిడిపి, వైసిపిలు ఇక్కడ ప్రదర్శనలు చేపట్టాయి. వాటితో ఇక్కడి రాజకీయ వాతావరణం వేడెక్కింది. పోటాపోటీగా రెండు పార్టీల నాయకులు కార్యక్రమాలు చేపట్టారు.



## వివాదంగా మారిన ఉషశ్రీ

అనంతపురం, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)టీడీపీకి పట్టున్న నియోజకవర్గం. ట్రాక్ రికార్డు చూస్తే వైసీపీకి అక్కడ కాలుమోపడం కూడా సాధ్యం కాదు. అలాంటిది గత ఎన్నికల్లో జగన్ ఇమేజ్ తో ఆ నియోజకవర్గం కూడా వైసీపీ సొంత మయింది. అదే కల్యాణదుర్గం నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ తొలిసారి గెలిచారు. ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినా ఆమె మాత్రం ఆధిపత్యం కోసం పాకులాడుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని వైసీపీ లో విభేదాలు తీవ్రమయ్యాయి.. ఈ నియోజకవర్గం చరిత్ర చూస్తే వైసీపీ నేతలు ఒళ్లు దగ్గరపెట్టుకుని వ్యవహరించాల్సి ఉంటుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొమ్మిది సార్లు ఎన్నికలు జరిగితే ఐదు సార్లు టీడీపీ విజయం సాధించింది. ఒకసారి దాని మిత్రపక్షం గెలిచింది. 1989, 2009లోనే అక్కడ టీడీపీని పక్కన పెట్టి కాంగ్రెస్ గెలిచింది. 2014 ఎన్నికల్లోనూ కల్యాణదుర్గంలో టీడీపీ విజయం సాధించింది. గత ఎన్నికలలో మాత్రం ఇక్కడ వైసీపీ జెండా ఎగురగలిగింది. అనంతపురం జిల్లాలో ఉరవకొండ, హిందూపురం తప్పించి అన్ని నియోజకవర్గాలను వైసీపీ సొంతం చేసుకుంది. అయితే కల్యాణదుర్గం ఎమ్మెల్యేగా గెలిచిన ఉషశ్రీ చరణ్ తొలి నుంచి వివాదంగా మారారని వైకాపా కార్యకర్తల ఆరోపణ. ఆమె పార్టీ క్యాడర్ కు అందుబాటులో ఉండరు. తాము నియమించిన పీఏనే అన్నీ చక్క బెడుతుంటారు. ఉషశ్రీ చరణ్ మాత్రం ఎక్కువగా బెంగళూరుకే పరిమితమయి ఉంటారు. ఎమ్మెల్యేను కలవడం కూడా క్యాడర్ కు కష్టంగా మారింది. అడపాదడపా నియోజకవర్గానికి వచ్చి తన పనులను చక్క బెట్టుకుంటారని వారంటున్నారు. రెండోసారి గెలవాలన్న ఆలోచన ఉషశ్రీ చరణ్ లో లేనట్లు కన్పిస్తుందని వారి ప్రధాన విమర్శ. ఇప్పటికే పార్టీ నుంచి ధిక్కార స్వరం ప్రారంభమయింది. మున్సిపల్ ఛైర్మన్ కౌన్సిలర్లు తిరుగుబాటు జెండాను ఎగుర వేశారు. తమపై కక్ష సాధిస్తున్నారని వారు కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై అధిష్టానం కూడా సీరియస్ గానే ఉందని తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో టీడీపీ నేతల్లో ఉన్న విభేదాలను సొమ్ము చేసుకోవాల్సిన వైసీపీ ఎమ్మెల్యే తాను కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నారరని పార్టీ వర్గాల భావన. ఈసారి ఉషశ్రీ చరణ్ కు టిక్కెట్ దక్కడం కష్టమేనంటున్నారు. అభ్యర్థిని మార్చాలని అధిష్టానం కూడా డిసైడ్ అయిందన్న ప్రచారం సాగుతుంది.

## పెద్దల సభకు మర్రి

గుంటూరు, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)పదవి ఎప్పుడు ఎక్కడ రాసి పెట్టి ఉంటుందో ఎవరికీ తెలియదు. కొందరికి ఊహించని విధంగా పదవులు దక్కుతుంటాయి. మరికొందరికి ఎంత ప్రయత్నించినా పదవి అనేది వారికి అందదు. విసిగిపోయి వారు అలా నిరీక్షించాలి. లేకుంటే పార్టీ మారాలి. ఇప్పుడు గుంటూరు జిల్లా నేత మర్రి రాజశేఖర్ ది కూడా అదే పరిస్థితి. మర్రి రాజశేఖర్ కు రాజ్యసభ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది.మర్రి రాజశేఖర్ కమ్మ సామాజికవర్గానికి చెందిన నేత. ఆయన చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యేగా పనిచేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మర్రి రాజశేఖర్ కు ఎమ్మెల్యే అవకాశం లభించింది. వైఎస్ మరణం తర్వాత జగన్ వైసీపీ పెట్టడంతో అందులోకి వచ్చారు. గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. మర్రి రాజశేఖర్ ను జగన్ 2019 ఎన్నికలకు ముందు వరకూ అమితంగానే ప్రేమించేవారు 2019 ఎన్నికల్లో మర్రి రాజశేఖర్ కు సామాజిక సమీకరణాల్లో భాగంగా జగన్ టిక్కెట్ ఇవ్వలేక పోయారు. విడదల రజనీకి టిక్కెట్ ఇచ్చారు. అయినా మర్రి రాజశేఖర్ కు పార్టీ కోసం పనిచేశారు. కానీ మూడేళ్లవుతున్నా ఆయనకు పదవి ఇవ్వకపోవడం పార్టీలోనే విమర్శలకు తావిచ్చింది. ఎంతో మందికి జగన్ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. మంత్రి పదవి కూడా ఇస్తానన్న జగన్ మాత్రం రాజశేఖర్ ను పట్టించుకోలేదు. కమ్మ సామాజికవర్గంలోనూ రాజశేఖర్ కంటే వెనక వచ్చిన వారికి పదవులు దక్కాయి.దీంతో మర్రి రాజశేఖర్ కుటుంబం నుంచి కూడా జగన్ పై విమర్శలు వచ్చాయి. మర్రి రాజశేఖర్ రాజకీయాలు మాని న్యాయవాది వృత్తిలోకి కూడా వెళ్లారు. అయితే రెండు, మూడు రోజుల క్రితం జగన్ మర్రి రాజశేఖర్ ను తాడేపల్లికి పిలిపించుకుని ఆయనకు స్పష్టం చేసినట్లు తెలిసింది. రాజ్యసభకు వెళ్లాలని కోరినట్లు చెబుతున్నారు. రానున్న మార్చి నాటికి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఇందులో ఒకటి మర్రి రాజశేఖర్ కు ఫిక్స్ చేశారు. అయితే మర్రి మాత్రం శాసనమండలిని కోరుకుంటున్నా, జగన్ మాత్రం ఆయనను రాజ్యసభకు పంపాలని డిసైడ్ అయ్యారు.

## రఘురామ కృష్ణరాజు పై అనర్హత వేటు కత్తి

ఏలూరు, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు పై అనర్హత వేటు కత్తి వేలాడుతుంది. ఆయనకు స్పష్టమైన సిగ్నల్స్ వచ్చిన తర్వాతనే రాజీనామా యోచనకు దిగినట్లు తెలిసింది. ఫిబ్రవరి ఐదు తర్వాత రఘురామ కృష్ణరాజు రాజీనామా చేయనున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్పష్టం చేశారు. తనపై అనర్హత వేటు పడుతుందని తెలియడంతోనే ఆయన ముందుగానే రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. కొందరు పెద్దల సూచనలు కూడా అందడంతో ఆయన రాజీనామా ఆలోచన చేశారంటున్నారు. నిజానికి రఘురామ కృష్ణరాజు జగన్ కంటే మొండోడు అన్న పేరుంది. ఆయన పార్టీలోనే ఉండి ఇబ్బంది పెట్టాలని భావించారు. వచ్చే ఎన్నికలకు ముందు పార్టీ మారితే సరిపోతుందనుకున్నారు. ఏ పార్టీలో చేరాలన్నది అప్పుడే నిర్ణయించుకోవచ్చని, అప్పటి వరకూ అన్ని పార్టీలతో సఖ్యత కొనసాగించాలని రఘురామ కృష్ణరాజు భావించారు. ఈ మేరకు బీజేపీ పెద్దలతో ఆయన టచ్ లోకి వెళ్లారు. అందుకే పార్టీని ధిక్కరించకుండా విమర్శలు చేస్తూ వైసీపీకి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. ఇదే పద్ధతిని 2024 ఎన్నికల వరకూ కంటిన్యూ చేయాలని రఘురామ కృష్ణరాజు భావించారు. ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతల కూడా ఇదే రకమైన సలహా ఇవ్వడంతో రచ్చ బండ పేరుతో మీడియా సమావేశాలను ఏర్పాటు చేసి ఆయన వైసీపీని ఇబ్బందుల్లోకి నెట్టేశారు. ఇప్పుడు స్పీకర్ కార్యాలయం కదిలింది. రఘురామ కృష్ణరాజు అనర్హత పిటీషన్ ను స్పీకర్ ప్రివిలేజ్ కమిటీకి పంపారు. ప్రాథమిక దర్యాప్తు జరపాలని ఆదేశించారు. రఘురామ కృష్ణరాజుకు వ్యతిరేకంగా ఆధారాలున్నాయని కొందరు బీజేపీ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు తెలిసింది. అందుకే ఆయనను గౌరవంగా రాజీనామా చేసి తప్పుకోవాలని సూచించారని, లేకుంటే అనర్హత వేటు పడుతుందని చెప్పడంతోనే ఆయన రాజీనామాకు సిద్ధమయ్యారు. మరో వారం రోజుల్లో రఘురామ కృష్ణరాజు రాజీనామా చేయనున్నారు. ఆయన రాజీనామా వెనక ఇదే ప్రధాన కారణమన్న కామెంట్స్ ఢిల్లీలో వినిపిస్తున్నాయి. అనర్హత వేటు తనపై పడేందుకు కనీసం ఏడాది సమయం పడుతుందని ఆయన చెబుతున్నా, కొందరి సూచనల మేరకే ఆయన రాజీనామా చేయనున్నారని తెలుస్తోంది.

## శ్మశానంలో సమస్యలకు నెలవు

వైజాగ్, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)చివరి మజిలి శ్మశాన వాటికలు సమస్యలు నెలవుగా మారాయి. భీమిలి, తగరపువలసల్లో ఉన్న శ్మశాన వాటికల్లో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మెరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఏ శ్మశానాల్లో చూసినా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో, చుట్టూరా అపరిశుభ్రతతో నిండి ఉన్న దృశ్యాలే దర్శిన మిస్తున్నాయి. భీమిలి, తగరపు వలసల్లో ఉన్న శ్మశానాల్లో సమస్యలకు నెలవులుగా ఉన్నాయి. కనీసం దహన సంస్కారాలకు మృతదేహాన్ని తీసుకెళ్లిన బంధువులు సేద తీరే షెల్టర్లు ఎక్కడా కానరాలేదు. వర్షం కురిసిన, ఎండ కాసిన, అనేక ఇబ్బందుల్లో దహన సంస్కారాలు చేస్తున్నారు. పలు శ్మశాన వాటికల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులకు పట్టడంలేదు. చిట్టివలస జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు, గుడివాడకు వెళ్లే గొస్తనీ వంతెన సమీపంలో ఉన్న శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కొంతకాలంగా చేసిన వినతులు, విజ్ఞప్తులకు స్పందించిన అధికారులు ఎట్టకేలకు ప్రహరి నిర్మాణానికి రూ. 30 లక్షలతో ప్రహరి నిర్మించారు. కానీ దానిలో కూడా నాణ్యత కొరవడిందంటూ కొంతమంది స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణానికై మంజూరు చేసిన రూ. 30 లక్షల్లో, కేవలం రూ. 20 నుంచి 23 లక్షలు మాత్రమే ఖర్చు అయినట్లుగా స్థానికులు వాపోతున్నారు. శ్మశాన వాటిక చుట్టూర ప్రహరీ అయితే నిర్మించారు, గానీ మౌలిక సదుపాయాలు మచ్చుకు కూడా కానరాని పరిస్థితి, ప్రహరీ కూడా చుట్టూరా నిర్మించకపోవడంతో అనివార్యంగా అపరిశుభ్రత నెలకొని ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సౌకర్యాల కల్పనకు సత్యసాయి సేవా సమితి, ఇతర పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చిట్టివలస, భీమిలి బ్యాంక్ కాలనీ, సమీపంలో షెడ్లు, మంచినీటి బోర్లు నిర్మించారు.

## ఢమాల్..ఢమాల్ అంటున్న టమాటా



కర్నూలు, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)గత కొన్ని రోజుల క్రితం వరకూ టమాటా ధర చుక్కలను తాకింది. గత ఏడాది చివరిలో ఆంధ్ర ప్రదేశ్ లో కురుసిన వర్షాలతో టమాటా ధర ఆల్ టైం హై కు చేరుకుంది. రైతులకు లాభాలను.. సామాన్యులకు కంట కన్నీరు పెట్టించాయి. అయితే ఇప్పుడు టమాటా ధరలు అకస్మాత్తుగా నేలచూపులు చూస్తున్నాయి. నిన్నా మొన్నటి వరకూ కిలో రూ. 30 నుంచి రూ. 40ల వరకూ పలికిన టమాటా ధర.. నేడు కిలో ఐదు రూపాయలు అన్నా కొనేవారు లేరు.కర్నూలు జిల్లాలో టమోటా ధరలు చిత్రవిచిత్రంగా పలుకుతున్నాయి. మార్కెట్లో ప్రతిరోజు హెచ్చుతగ్గులు ఉండటంతో ఎప్పుడు ధర ఉంటుందో ఎప్పుడు తగ్గుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిన్న మొన్నటి వరకూ టమాటా ధర సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. కిలో టమాటా ధర 150 నుంచి 200రూపాయలు పలికిన సందర్భం కూడా ఉంది. టమాటా దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోవడంతో ధర అమాంతం పెరిగిపోయింది. టమాటా ధర ఇప్పుడిప్పుడే దిగి వస్తుంది. మొన్నటి వరకూ కిలో నలభై రూపాయలు పలికిన టమాటా రెండు మూడు రోజుల నుంచి ఇరవై రూపాయలకు చేరుకుంది. తాజాగా కర్నూలు ఆస్పరి మార్కెట్ లో అయితే కిలో టామాటా ఐదు రూపాయలే పలికింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మొన్నటి వరకూ ఇదే మార్కెట్ లో వంద రూపాయలు పలికిన టమాటా నేడు ఐదు రూపాయలకు చేరుకోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తమకు గిట్టుబాటు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఏయూలో అప్రజాస్వామ్య విధానాలు

విశాఖపట్నంఅత్యున్నత విద్యావిలువలు కలిగిన విశాఖ ఏయూ అప్రజాస్వామ్య విధానాలు కొనసాగుతున్నాయని విద్యార్థి యువజన , అభ్యుదయ సంఘాల ఐక్యవేదిక ఆరోపింది.వర్శిటీ ఉన్నతాధికారుల నిర్ణయాలకు విద్యార్థులకు శాపంగా మారుతుందని విద్యార్థి యువజన విభాగం నేత సురేష్ అన్నారు.గతంలో ఎన్నడూ లేని విదంగా నిర్ణయాలు తీసుకొంస్తున్నారని,ముఖ్యంగా సీట్ల సంఖ్యను తగ్గించి విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారని అన్నారు.ఉత్తరాంధ్రలో అతిపెద్ద వర్శిటీగా ఉన్న ఏయూలో అధికారుల తీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అన్నారు.30 డిమాండ్లతో విడుదల చేసిన కరపత్రంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

## వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు రక్షణ కరువు : వర్ల రామయ్య

విజయవాడ ఫిబ్రవరి 1 వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ నేత వర్ల రామయ్య అన్నారు. టీడీపీ దళిత సెల్ ఆధ్వర్యంలో నగరంలో దళిత ప్రతిఘటన సదస్సు జరిగింది. సదససులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అన్యాయాన్ని ప్రశ్నిస్తే శిరోముండనం చేయించింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. మాస్క్ పెట్టుకోలేదని



కొట్టి చంపింది వాస్తవం కాదా అని ఆయన నిలదీశారు. అత్యాచారాలకు గురైన దళిత యువతులకు ఏం న్యాయం చేశారని ఆయన ప్రశ్నించారు. నిందితులకు కొమ్ము కాసేలా అధికార పార్టీ నేతల తీరు ఉందని ఆయన ఆరోపించారు. ఈ సదస్సులో పార్టీ నేతలు యం.యస్.రాజు, నెట్టెం రఘురాం, దేవినేని ఉమ, తదితరులు హాజరయ్యారు.

# లైంగిక వేధింపులు చేసింది నిజమే

### ఒప్పుకున్న వినోద్ జైన్

విజయవాడ, ఫిబ్రవరి 2 తన లైంగిక వేధింపులతో బాలిక జీవితాన్ని నాశనం చేసిన విజయవాడ టీడీపీ నాయకుడు వినోద్‌జైన్ పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఒప్పుకున్నాడు. బాలిక ఆత్మహత్య చేసుకునేంతవరకు ఈ ఘటన వెళుతుందని ఊహించలేదని వినోద్ జైన్ పోలీసులతో అన్నట్లు తెలిసింది.విజయవాడ కుమ్మరిపాలెం సెంటర్‌లోని లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌లో టీడీపీ నేత వినోద్ జైన్ లైంగిక వేధింపులు తాళలేక 14 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు కారణమైన వినోద్ జైన్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలిక బెంజి సర్కిల్ వద్ద ఒక స్కూల్ లో 9వ తరగతి చదువుతోంది.రెండు నెలలకు పైగా వినోద్‌జైన్ తనపై చేస్తున్న లైంగిక వేధింపులు తట్టుకోలేక బాలిక జనవరి29న అపార్ట్ మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకోటానికి ముందు బాలిక రాసిన సూసైడ్ నోట్ ద్వారా వినోద్ జైనును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వద్ద లభించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను చూపిస్తూ పోలీసులు వినోద్ జైన్‌ను ప్రశ్నిస్తున్నారు.బాలిక ఆత్మహత్య దృశ్యాలు రికార్డై ఉన్నాయి. బాలిక స్కూల్‌కు వెళ్లేప్పుడా? వచ్చేప్పుడు అపార్ట్‌మెంట్‌లో మెట్లు ఎక్కే సమయంలో?. దిగే సమయంలో, లిఫ్ట్ వద్ద బాలికను వేధించినట్టు అంగీకరించాడు. స్కూల్‌కు వెళ్తున్నప్పుడు, వచ్చేటప్పుడు పాపకోసం ఎదురు చూసి ఆమెను తాకుతూ ఇబ్బందులకు గురి చేసినట్లు పోలీసులకు తెలిపాడు. పాపకు సన్నిహితంగా మెలిగేందుకు ప్రయత్నించానని తెలిపాడుబాలికను తాకుతూ తాను ఆనందం పొందేవాడినని పోలీసుల విచారణలో వినోద్‌జైన్ నేరం ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. తాను చేసింది తప్పేనని?. ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంటుందని ఊహించలేదని? వ్యవహారం ఇంత దాకా వస్తుందని ఊహించలేదని చెప్పినట్లు తెలిసింది. బాలిక ఆత్మహత్య చేసుకునే ముందర డాబాపైన పిట్టగోడ వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్షులు బాలికను?.. కిందపడతావు? అని వారించినట్లు.. అంతా నిమిషంలోపే జరిగిపోయిందని వారు చెబుతున్నారు.

# రాయలసీమను పది జిల్లాలుగా విభజించాలి

### రాయలసీమ మేధావుల ఫోరం మేధావులు అభిప్రాయం

తిరుపతి,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): జిల్లాల ఏర్పాటు ప్రక్రియ తేనెతుట్టెను కదిలించినట్లుగా మారింది. ఎక్కడిక్కడ డిమాండ్లు పెరుగుతున్నాయి. అలాగే రాయలసీమను పది జిల్లాలుగా విభజించాలని రాయలసీమ మేధావుల ఫోరం మేధావులు అభిప్రాయపడ్డారు. జిల్లాల పునర్వవస్థీకరణపై చర్చాగోష్ఠి జరిగింది. ఇందులో పాల్గొన్న ఫోరం కన్వీనర్ మాకిరెడ్డి పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్లు కృష్ణమోహన్‌రెడ్డి, సుధాకరయ్య,పీసీ వెంకటేశ్వర్లు, రిటైర్డు ప్రొఫెసర్లు జయచంద్రారెడ్డి, నాగోలు కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర విస్తీర్ణంలో రాయలసీమ 42 శాతం వున్నందున పది జిల్లాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మదనపల్లె, గుంతకల్లు, పులివెందుల, మార్కాపురం పట్టణాలను జిల్లా కేంద్రాలుగా ప్రకటించాలని కోరారు. జిల్లా కేంద్రాలను ఇపుడున్న పేర్లతోనే కొనసాగించాలని, ఒకవేళ మార్చాలని ప్రభుత్వం భావిస్తే పప్పూరి రామాచార్యులు, దామోదరం సంజీవయ్య, ఉయ్యాలవాడ సంజీవరెడ్డి, నీలం సంజీవరెడ్డి పేర్లను పరిశీలించాలని కోరారు. విద్యాసంస్థల పరిధిని నిర్ణయించే సందర్భంలో ప్రభుత్వం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు డిమాండ్‌తో జిల్లా సాధన సమితి, జేఏసీలు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో ఆందోళను కొనసాగుతున్నాయి. వైసీపీ నేతలు చేసిన ద్రోహంతో తిరుపతికి నాన్‌లోకల్ అయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పడమటి ప్రజలను మోసం చేస్తున్న ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా దద్దమ్మలేనని ఎద్దేవా చేశారు. మదనపల్లె జిల్లా సాధనకు చేపట్టే ఎలాంటి ఉద్యమానికైనా తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మారుమూల వుండిపోయిన కుప్పం ప్రాంతానికి ప్రాముఖ్యత తేవడం కోసం డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, దీనికోసం ఉద్యమం చేపడతామంటూ సంఘాల నేతలు ప్రకటించారు.

# గులాబీ వర్సెస్ కమలం

హైద్రాబాద్, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)కేంద్రంలోని బీజేపీతో తీవ్ర స్థాయిలో యుద్ధం చేయాలని, రాజకీయంగా ఆ పార్టీ శత్రువేనని టీఆర్ఎస్ ఎంపీలకు అధినేత కేసీఆర్ క్లారిటీ ఇచ్చారు. ఆ పార్టీపై అన్ని రూపాల్లో పోరు చేయాల్సిందేనని, సాఫ్ట్ కార్నర్ వద్దని స్పష్టం చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వడ్ల కొనుగోళ్ల విషయంలో ప్రదర్శించిన దూకుడును మరింతగా పెంచాలని, ఉభయ సభలను స్తంభింపజేసే స్థాయిలో ఉండాలని వివరించారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వైఖరిపై ఉభయ సభల ఎంపీలతో ప్రగతి భవన్‌లో సుదీర్ఘంగా సమావేశం నిర్వహించిన కేసీఆర్ 23 అంశాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. విభజన హామీలను సాధించుకోడానికి, రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన నిధులను రాబట్టుకోడానికి, డిమాండ్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అవకాశం దొరికిన ప్రతీ సందర్భంలో నిలదీయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర అవసరాలపై ఇప్పటివరకు తనతో పాటు పలువురు మంత్రులు లేఖలు రాశారని, ఢిల్లీలో స్వయంగా కలిసినప్పుడు కేంద్ర మంత్రులకు వివరించారని, ఇప్పుడు పార్లమెంటు వేదికగా కొట్లాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీజేపీతో ఎలాంటి దోస్తానా లేదని, అది ముమ్మాటికీ టీఆర్ఎస్ పార్టీకి రాజకీయ శత్రువేనని, వెనక్కి తగ్గేదే లేదని కేసీఆర్ ఈ సమావేశంలో ఎంపీలకు క్లారిటీ ఇచ్చారు. ఆ పార్టీ పట్ల ఎలాంటి మెతకవైఖరి అవసరం లేదని, రాజకీయ శత్రుత్వంతోనే కొనసాగాలని పిలుపునిచ్చారు. ఎలాగూ రాష్ట్రానికి కేంద్రం ఏమీ ఇవ్వదని, ఆ విషయం ఇప్పటిదాకా కొనసాగించిన వైఖరితోనే తేటతెల్లమైందని, ఇక చేయాల్సింది చేయడమే టీఆర్ఎస్ వైఖరిగా ఉండాలని ఎంపీలకు నొక్కిచెప్పారు.పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వరి ధాన్యం కోనుగోళ్ల అంశంపై ఉభయ సభలను స్థంభింపజేసిన మోతాదుకు మించి ఇప్పుడు బడ్జెట్ సమావేశాల్లో టీఆర్ఎస్ దూకుడు ఉండాలని కేసీఆర్ స్పష్టం చేసినట్లు ఎంపీలు పేర్కొన్నారు. బయ్యారం ఉక్కు, ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్శిటీ, ఐఐఎం, కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ, మెగా టెక్స్‌టైల్ పార్కు తదితర పలు హామీలపై కేంద్రాన్ని నిలదీయాలని ఆదేశించారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ, ఎరువుల ధర పెంపు, కొత్త విద్యుత్ చట్టం, సివిల్ సర్వీసెస్ రూల్స్‌కు సవరణ తదితర అంశాలపైనా పార్లమెంటు వేదికగా గట్టిగా నిరసన తెలియజేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీఎంవో ముఖ్య కార్యదర్శి తదితరులు ఎంపీలకు వివరించారు.రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులకు సంబంధించిన అంశాలపై ఎంపీలకు వివరాలను అందజేశారు. కేంద్రంతో కొట్లాడే పోరాట పంథాపై వివరించారు. గతంలో ప్రధాని సహా కేంద్ర మంత్రులకు తెలంగాణ తరఫున అందజేసిన మెమొరాండంలు, వాటికి స్పందన రాకపోవడం లాంటివాటిని గుర్తుచేసి ఆ లేఖలను కూడా ఎంపీలకు అందించారు. విభజన చట్టంలో ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న అంశాలనూ ఈ సమావేశాల్లో ప్రస్తావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు ఏమేం ఇచ్చిందో పరిశీలించిన తర్వాత వాటిపై గట్టిగా నిలదీయడానికి సంబంధించి పోరాట రూపాన్ని ఎంచుకోవాలని సూచించారు. రైల్వేలు, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన తదితరాలకు బడ్జెట్‌లో తెలంగాణకు దక్కిన అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.శీతాకాల సమావేశాల సందర్భంగా వడ్ల కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఎంపీలు ఉభయ సభల్లో చేపట్టిన నిరసనను కేసీఆర్ స్వయంగా అభినందించారు. వారం రోజుల తర్వాత మొత్తం సమావేశాలనే బహిష్కరించారు. ఇప్పుడు కూడా కేంద్రంపై పోరాట స్ఫూర్తి దానికి మించి ఉండాలని నొక్కిచెప్పడంతో ఎంపీలు దానికి తగిన వ్యూహాన్ని రూపొందించుకోనున్నారు. గత సమావేశాల్లో ప్లకార్డులతో స్పీకర్ పోడియం దగ్గరకు వెళ్ళి నిరసన తెలిపారు. ఈ సారి ఎలాంటి దూకుడు ప్రదర్శిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నెల 5వ తేదీన ముచ్చింతల్‌లోని రామానుజాచార్యుల సమతామూర్తి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రధాని వస్తున్న నేపథ్యంలో పార్లమెంటులో టీఆర్ఎస్ వైఖరి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందనేది కీలకంగా మారింది.

# పటిష్ట పంచాయితీ వ్యవస్థ అసవరం

### కేరళ తరహా విధానం మేలంటున్న నేతలు

అమరావతి,ఫిబ్రవరి1: పంచాయతీల్లో పన్నుల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన ఒక పరిశీలనలో వెల్లడైంది. కేరళ తరహా విధానం అవలంబించాలని సిపిఎం నేతలు సూచిస్తున్నారు. కొత్త భవనాలకు ఆస్తి పన్ను విధింపు, ఉన్న పన్నులను ప్రతి అయిదేళ్లకోసారి సవరించాలన్న ఆదేశాలు పంచాయతీల్లో అమలుకు నోచుకోవడం లేదు. ఆర్థిక సంఘ నిధులు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లపై వచ్చే స్టాంపు డ్యూటీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే గ్రాంట్లతోనే అత్యధిక పంచాయతీలు సరిపెట్టుకుంటున్నాయి. కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పంచాయతీలు ఆర్థికంగా బలోపేతంగా ఉన్నాయంటే పన్నుల వ్యవస్థ పటిష్ఠంగా ఉండటమే ప్రధాన కారణమని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు ఆస్తి పన్ను, పన్నేతర రుసుముల కింద ఏటా రూ.732కోట్లకుపైగా ఆదాయం వస్తున్నట్లు గణాంకాలున్నాయి. కానీ, 50శాతంనుంచి 60శాతానికి మించి అందులో వసూలు కావడం లేదు. పాలకవర్గాలు పట్టించుకోకపోవడం, ప్రజల సహకారం కొరవడటమే ఇందుకు కారణం అని భావిస్తున్నారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సాయం అవసరం కాగా, ఇప్పటికే అనేక కార్యక్రమాలు రూపొందించినప్పటికీ వాటికి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. తద్వారా పనులపై ప్రతికూల ప్రభావం పడుతోంది. పట్టణ తరహా గ్రామీణాభివృద్ధి (రూర్బన్) కార్యక్రమం కోసంరాష్ట్రంలోని విశాఖపట్నం, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని అయిదు పంచాయతీలను గతంలో ఎంపిక చేశారు. రూ.135 కోట్లతో ఆయా గ్రామాల్లో వివిధ పనుల నిర్వహణకు వీలుగా కార్యాచరణ రూపొందించారు. ఇందులో కేంద్రం 60శాతం, రాష్ట్రం మిగతా 40 శాతం నిధులు సమకూర్చేందుకు ఒప్పందం కుదిరింది. అయినా ఈ పనులు పూర్తి చేయని పరిస్థితి నెలకొంది. నిధులు గడువులోగా ఖర్చు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. కేంద్రం కూడా నిధులు సకాలంలో విడుదల చేయాలి. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 32 లక్షల కుటుంబాల కోసం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు. ఇళ్ల నుంచి చెత్తతోపాటు పశువుల పేడనూ సేకరించి వాటి ద్వారా ఏటా రూ.600 కోట్ల సంపద సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందించారు. పన్నేతర రుసుము వసూళ్లు, అందులోని లొసుగులను సవరిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉన్నా ఆ దిశగా గ్రామ పంచాయతీలు దృష్టి సారించడం లేదు. రెండు జిల్లాలను ఇప్పటికే బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మిగతా 11 జిల్లాలపైనా దృష్టి పెట్టింది. భారీగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ చాలా జిల్లాల్లో అధ్వానంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. వీటికి కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేస్తే మరిన్ని ఫలితాలు సాధించొచ్చని భావిస్తున్నారు.

## దళిత కుటుంబం వెలి

### ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా

ఏలూరు ఒకే కులానికి చెందిన దళిత సంఘాల్లో ఇంకా అనాగరికత చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే దళితులకు సంబంధించిన సంఘంలో కులాంతర వివాహం చేసుకున్నాడని నెపంతో వారి కుటుంబానికి 20 వేల రూపాయలు జరిమానా కట్టాలని కట్టని పక్షంలో మా సంఘంలో కి రావద్దు అని నిర్మొహమాటంగా చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించారు.బాధిత కుటుంబాలతో ఇరుగుపొరుగువారు మాట మంచి లేకుండా కనీస అవసరాలైన నిత్యవసర వస్తువులు కూడా ఆ కుటుంబానికి ఇవ్వకూడదని ఆశ వర్కర్ గాని వాలంటరీ గాని ఆ కుటుంబం దగ్గరికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నీరు నిప్పు ఇవ్వకుండా చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ రోజు మా ఇంట్లో మా ఇంటి యజమాని అనారోగ్యంతో బాధపడుతూ ఉంటే కనీసం ఆర్ఎంపీ డాక్టర్ ను కూడా రానివ్వకుండా చేస్తున్నారని భాధను వ్యక్తం చేశారు. తన కొడుకు కులాంతర వివాహం చేసుకున్నాడని నెపంతో మా ఇరువురి రెండు కుటుంబాలకు సఖ్యతతో పెళ్లి చేసుకున్నప్పటికీ ఈ పెద్దలకు సంబంధించిన కొంత అమౌంట్ ఇవ్వలేదని కారణంతో సంఘంలో తప్పు వేయడంతో మేము ఆ తప్పుకు ఫైన్ కట్టలేదని సాకులు చూపి మమ్మల్ని ఆ సంఘం నుంచి వెలి వేయడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో స్థానిక ఎమ్మార్వోను ఆశ్రయించమని అన్నారు. ఇంతవరకు ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదని నవంబర్ 8 వ తారీఖున పోలీస్స్టేషన్లో కంప్లైంట్ చేసినప్పటికీ ఇంతవరకు ఎవరు ఇంటి వైపు కూడా చూడలేదని అన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసినా కానీ ఎటువంటి స్పందన కనపడలేదని ఆ కుటుంబం మొత్తం కుటుంబ సభ్యులతో ఈరోజు పోడూరు మండలం తాసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి వారి గోడు వెళ్లబోసుకున్నారు. వెలివేసిన పెద్దలపై కఠిన చర్యలు తీసుకోవాలని వెలి నుండి విడిపించండి మాకు న్యాయం చేయండి లేకపోతే మాకు సావే శరణం అనే శ్లోకంతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. లేనిపక్షంలో చావడమే తప్ప వేరే మార్గం లేదని ప్రాధేయపడ్డారు

## కొప్పర్తి జగన్ నన్న కాలనీలో నీళ్లు,కరెంటు సౌకర్యం కల్పించాలి

కడప కొప్పర్తి జగనన్న కాలనీ గృహాలకు సత్వరమే నీళ్ల ట్యాంకులకు పైప్లైన్,కరెంటు కనెక్షన్ లు వేయ్యాలని ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి.బాదుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం కొప్పర్తి పరిధిలోని ఖాఖీఓ ఇంజనీరింగ్ కళాశాల వెనుక జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రభుత్వం మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్థాయి అధికారులు రివ్యూ సమావేశాలు కాకుండ కాలనీల్లో తిరిగి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పునాదులు గోడలు వేసుకున్నా లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.కరెంటు సరఫరా లేకపోవడం వల్ల,నీటి సరఫరా జరగక ఇళ్ల నిర్మాణాలు సాగడం లేదని, నిర్మిస్తున్న లబ్ది దారులకు ఖర్చులు పెరుగుతున్నాయని పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువచ్చి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే.లింగన్న, మాబాష,హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## సేవ మూర్తులకు ఘన సన్మానం

కడప కడప నగరం లోని అజాద్ నగర్ బృంద వృద్ధాశ్రమంలో నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధరాణీ ల అధ్వర్యంలో 7 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ సంస్థల ప్రతినిధులను, సేవ మూర్తులను ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే సేవ కార్యక్రమాలు విరివిగా చేపడుతున్న కడప యునైటెడ్ అసోసియేషన్ పాస్టర్స్ పుల్లూరు శ్రీనివాసులును, కే. ఆనంద్ ను ముఖ్య అతిథులుగా హాజరైన స్టెప్ సియివో రామ చంద్ర రెడ్డి ఘనంగా సన్మానించారు. పాస్టర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వృద్ధుల సేవకే అంకితమై, సొంత తల్లి దండ్రుల్ల వృద్ధుల బాగోగులు చూసుకుంటున్న నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధరాణీ ల దంపతులను కూడా సన్మానించి అభినందించారు. ఈ ఆశ్రమానికి అనేక మంది దాతలు ముందుకు రావాలని పిలుపనిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మహేష్ కుమారుడు పి.రవితేజ, న్యాయవాది జ్వాల ప్రభాకర్, అనేక సేవ కార్యక్రమ సంస్థ ప్రతినిధులు, అధికారులు, వృద్దులు, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మడివాడ మాచయ్య జయంతి వేడుకలు

కౌతాళం కౌతాళం మండలంలోని మెలిగానూరు ఉప్పరహాల్ గ్రామంలో మడివాడ మాచయ్య జయంతి సందర్భంగా మడివాల మాచయ్య చిత్రపటానికి పూలమాలవేసి పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు చేయడం జరిగింది.ఈ ఊరేగింపు లో మహిళలు లు దీపాలతో స్వాగతం పలికారు. మేళతాలలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు ఏకంరెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లికార్జున స్వామి, అంపయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాజకీయాలు చేస్తున్న పార్టీలు

విశాఖపట్నం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడుల విషయంలో ప్రధాన, ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తిపోసు కుంటున్నాయని బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటీవ్ సభ్యులు నాగమల్లేశ్వరి అన్నారు.ఓ వైపు దాడులతో బాలికలకు రక్షణ లేకుండాపోతుంటే వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం,ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం గణాంకాలు లెక్కిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.ప్రభుత్వాలు మారే కొద్ది కొత్త నిబంధనలు తీసుకొస్తున్నారని,అయినా దాడులు మాత్రం ఆగడం లేదని అన్నారు.గత ప్రభుత్వ హాయంలో ఎన్ని దాడులు జరిగాయి,ఈ ప్రభుత్వంలో ఎన్ని దాడులు జరిగాయని మాట్లాడుతున్నారే కానీ కఠిన చర్యలు తీసుకోవడంలో మాత్రం వైఫల్యం చెందారని అన్నారు.మహిళ హోమ్ మంత్రిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో దాడులు జరుగుతున్నాయంటే పరిస్థితి ఎంత ధారుణంగా ఉందో అర్థమవుతుందని చెప్పారు.

## అంజనేయ విగ్రహం ధ్వంసం..ఉద్రిక్తత

విశాఖపట్నం భీమిలి చినబజార్ వద్ద ఆంజనేయస్వామి విగ్రహాన్ని కొందరు వ్యక్తులు కూల్చివేయడంతో అక్కడ ఉద్రిక్త నెలకొంది. అన్నదమ్ముల పిల్లల మధ్య ఆస్తి తగాదాలు నేపథ్యంలో విగ్రహం కూల్చి వేసినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గుడిని కూడా కూల్చివేసేందుకు మంగళవారం తెల్లవారుజామున జేసీబీ తెచ్చారు.

# ఇంటర్ మీడియట్, ఒకేషనల్,జనరల్ కళాశాలకు ఆర్.టి.ఎఫ్,ట్యూషన్ ఫీజు ను వెంటనే మంజూరు చేయాలి..



### .బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి,యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.రియాజ్ డిమాండ్...

నంద్యాల ఫిబ్రవరి 01 ( విభారె) స్థానిక నంద్యాల పట్టణం బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాల నుంచి అనగా ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు స్థాపించినప్పటి నుంచి అనేక ప్రభుత్వాలు ఇంటర్మీడియట్ ఒకేషనల్,జనరల్ కళాశాలకు విద్యార్థుల తరపున ఇచ్చే ఆర్.టి.ఎఫ్, రియంబర్స్మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజును , అన్ని ప్రభుత్వాలు మంజూరు చేయడం జరిగిందని,ఐతే గత మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రభుత్వం ఆర్ టి ఎఫ్ నిధులను విడుదల చేయకపోవడం దారుణమని, దీని ద్వారా విద్యార్థులకు కళాశాల ఫీజులకు మరియు విద్యార్థుల పరీక్ష ఫీజు నుంచి కొంత ఊరట విద్యార్థులు కలిగేదని, కానీ రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాల నుంచి ఈ ఆర్ టి ఎఫ్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల అనేక మంది పేద, విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని, కనుక రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడిట్ కళాశాలలకు విడుదలయ్యే ఆర్.టి.ఎఫ్ నిధులను ను వెంటనే మంజూరు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఆర్.ఐ.ఓ ఆఫీసు ల ముందర, ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాజు,రమేష్,ఖాజా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలు దళిత లకు ముస్లిం లకు ఇవ్వాలి...

నంద్యాల ఫిబ్రవరి 01 (( విభారె), )ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన సమైక్య సంఘం కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో దళిత గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమవారపు మధు బాబు జానో జాగో (ముస్లింల అభివృద్ధి వేదిక ) జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా వారు మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ నుంచి త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి వాటిలో రెండు స్థానాలు ఒకటి దళితులకు ఒకటి ముస్లింలకు కేటాయించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితులకు ముస్లింలకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు వారి యొక్క క్యాబినెట్ లో సముచిత స్థానం ఇచ్చారని అలాగే దళితుల ముస్లింల కు రాజ్యసభలో కూడా స్థానమిచ్చి దళిత ముస్లింల పక్షపాతి అని నిరూపించుకోవాలని అలాగే సమస్యలపై పోరాటాలు చేయడానికి ఆంధ్ర ప్రదేశ్ దళిత గిరిజనుల ముస్లింల సమస్యలపై రాజ్యసభలో వారి హక్కులపై రాజ్యసభలో వినిపించడానికి దళిత గిరిజన ముస్లిం సభ్యులు రాష్ట్ర నుంచి కావాలని వారు అన్నారు. ఈ సమావేశంలో అవే దళిత గిరిజన సమాఖ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంగి ఎల్లయ్య షేక్ రఫీ పాల్గొన్నారు.




# పిఆర్సి ఉద్యోగులకు సిపిఎం పార్టీ మద్దతు




నందికొట్కూర్ ఫిబ్రవరి, 1 ( విభారె) ఉద్యోగుల పోరాటానికి సిపిఎం పార్టీ మద్ద తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు తెలియజేశారు. మంగళవారం నందికొట్కూరు సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు కె భాస్కర్ రెడ్డి బి రజిత పి పకీర్ సాహెబ్ ఆర్ జయ గారితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐ ఆర్ 27 శాతం ఇచ్చి పిఆర్సి 23 శాతానికి తగ్గించడం ,హౌస్ రెంట్ 16 శాతం నుంచి 8 శాతానికి తగ్గించడం, పెన్షనర్లకు 70 సంవత్సరాల నుండి 80 సంవత్సరాలకు పెంచడం, సిపిఎస్ అధికారంలోకి వచ్చిన వారం రోజులు రద్దు చేస్తామని హామీ అమలు చేయకపోవడం,ఉద్యోగుల రిటైర్మెంట్ 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాలకు పెంచడం మూలంగా నిరుద్యోగులకు నిరాశ పరచడం ప్రమోషన్ల వారికి అన్యాయం జరుగుతుందన్నారు .ఆర్టీసీ, సచివాలయ, ఉద్యోగులు ఆశ ,అంగన్వాడి మధ్యాహ్నం భోజనం తదితర స్కీమ్ వర్కర్ల కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికుల ను ఈ పిఆర్సి లో విస్మరించడం మూలంగా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు ఆందోళన చేస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు రాష్ట్రంలో పెరుగుతున్న తరుణం ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు ఇటువంటి తరుణంలో రాష్ట్రంలో ఆందోళన పరిస్థితులు నెలకొనడం రాష్ట్ర ప్రజలకు నష్ట దాయకమని ఆయన పేర్కొన్నారు రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తే ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక హక్కుల కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలోఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు తెలియజేశారు.

# కార్పొరేట్ వ్యవస్థ కొమ్ముకాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలి




ఎమ్మిగనూరు ఫిబ్రవరి 01 (( విభారె) పట్టణంలోని స్థానిక నారాయణ పాఠశాల ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తాయి ఈ సందర్భంగా నారాయణ పాఠశాలలో ధర్నాకు దిగిన రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జి నల్లారెడ్డి యాదవ్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉ దయ్ కుమార్ ఏ పీ ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ ఆందోళనకు దిగారు ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఇ గారికి చరవాణి ద్వారా ఫిర్యాదు చేయగా మండల విద్యాశాఖ అధికారి కి డిప్యూటీ డిఇఓ ఆదేశిస్తామని ఆదేశాలు జారీ చేసిన కార్పొరేట్ పాఠశాలల్లో వైపు కనీసం కన్నెత్తి చూడకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడి విద్యార్థి సంఘాలు డిప్యూటీ ఈవో సూర్య ప్రకాశ్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు గారి దిష్టిబొమ్మను దహనం చేశారు అనంతరం ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం లెక్కచేయకుండా అడ్మిషన్ నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని రంగు రంగు కరపత్రాల తో దోపిడీ ధ్యేయంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తామన్నారు నుండి విద్యా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే కార్పొరేట్ వ్యవస్థలకు విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తూ వ్యవహరించడం చాలా బాధాకరమని అలాంటి అధికారులు తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థి నాయకులు మండిపడ్డారు పాఠశాలకు ఆటస్థలం లేకపోయినా ఫీజుల పట్టిక లేకపోయినా విద్యార్థుల అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ జలగల పిలుస్తున్నారని విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి ఫర్నీచర్ను ధ్వంసం చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చిన్న రాజు అనిల్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

### విడుదల చేసిన బడ్జెట్ లో మన రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని కేంద్ర ప్రభుత్వం...సిపిఐ....

.నంద్యాల ఫిబ్రవరి 1 విభారె) పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ విడుదల చేసిన బడ్జెట్ లో మన రాష్ట్రానికి అన్యాయం చేశారని, సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ, ఈరోజు విడుదల చేసిన బడ్జెట్ లో పేద మధ్యతరగతి వర్గాలకు వేతన జీవులకు కష్టజీవులకు నిరాశ మిగిలింది అని అన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా అన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ అన్నారు కడప ఉక్కు ఫ్యాక్టరీ అన్నారు పోలవరానికి నిధులు ఇస్తామన్నారు. కానీ ఈ బడ్జెట్లో మనకు ఇచ్చిన హామీలు గురించి ఏ మాత్రం కూడా ప్రస్తావన తీసుకురాలేదు

# వచ్చే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టిక్కెట్లు కేటాయించాలి

### అన్ని రాజకీయ పార్టీలను హెచ్చరించిన బీసీ సంఘాల నేతలు

కర్నూల్ ఫిబ్రవరి 01 (( విభారె) 56 బీసీ కుల ఫెడరేషన్లకు వెంటనే నిధులు కేటాయించాల×రాష్ట్రంలో ఎదో ఒక జిల్లా పేరు మహత్మ జ్యోతిభాపూలే జిల్లాగా రాయలసీమ జిల్లాల్లో ఒక జిల్లా పేరు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లాగా ప్రకటించాలి×నక్కలమిట్ట శ్రీనీవాసులు మరియు బిసి ప్రజా సంఘాల నాయకులు తెలిపారువచ్చే ఎన్నికల్లో బీసీలకు 50శాతం టికెట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు మంగళవారం నగరంలోని బీసీ భవన్ నందు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన ×జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ×మరియు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం రాంబాబు × ×బీసీ ×విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి కే రామకృష్ణబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి శకుంతల బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎం అన్వర్×హుస్సేన్ లుమాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీలకు యాభై శాతం టిక్కెట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని లేనిపక్షంలో బీసీల సత్తా చూపిస్తామని అన్ని రాజకీయ పార్టీలను ఈ సందర్భంగా వారు హెచ్చరించారు అదేవిధంగా బీసీ కుల ఫెడరేషన్లు ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు నిధులు కేటాయించకపోవడం బీసీలను అణగదొక్కే కుట్ర జరుగుతోందని వారు ఆవేదన చెందారు వచ్చే ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో ఏడు అసెంబ్లీ ఒక ఎంపి టికెట్లు ఇవ్వాలని లేని పక్షంలో ఇప్పటి నుంచి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీలను చైతన్యపరుస్తూ బీసీల సత్తా చాటుతామని వారు హెచ్చరించారు అదేవిధంగా రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాకు మహాత్మ జ్యోతిరావు పూలే జిల్లాగా ప్రకటించాలని నంద్యాల జిల్లాలో బనగానపల్లె లో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం రచించాడు. కడప జిల్లా ను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లాగా ప్రకటించాలని వారు కోరారు ??డాక్టర్ అన్వర్ హుస్సేన్ జన్మదినం పురస్కరించుకుని×కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకోని వారికి ప్రతి ఒక్కరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవపూజ ధనుంజయ్య ఆచారి రాష్ట్ర అధ్యక్షులు బిసి ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లో గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారో, అదేవిధంగా జిల్లా అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే ఒక ఎంపీ స్థానానికి ఒక జిల్లాను ప్రకటించడం వల్ల మరింత వేగంగా అభివృద్ధి పుంజుకుంటుంది అన్నారు. రాంబాబు మాట్లాడుతూ చిన్న జిల్లాల వల్ల పరిపాలన సౌలభ్యం జరుగుతుంది అన్నారు. ఈకార్యక్రములో. సత్రం రామకృష్ణ. సోమేస్ శాలివాహన సంఘం నాగేశ్వరరావు. బండారు సురేష్ బాబు. చేన్నకేశవులు.

# మరో హీరోయిన్.. ప్రభాస్ నిజంగా డార్లింగ్

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తో ఒక్క సినిమాకు వర్క్ చేస్తే పాన్ ఇండియా స్టార్ గా మారిపోవడం ఖాయం. ఇప్పుడు ఆయన ఓ పాన్ ఇండియా సూపర్ స్టార్. ఏ ఇండియన్ స్టార్ కు.. ఏ బాలీవుడ్ పెద్ద హీరోలకు సాధ్యం కాని సినిమాలను ఇప్పుడు ప్రభాస్ చేస్తున్నాడు. ముందు ముందు ఆయన నుండి రాబోతున్న సినిమాల వసూళ్లు మినిమం మూడు నాలుగు వందల కోట్లు ఉ ండబోతున్నాయి. ఆ స్థాయిలో ఇండియన్ సినిమా స్థాయిని ఉన్నత స్థితికి తీసుకు వెళ్లిన ప్రభాస్ స్వభావం గురించి ఇప్పటి వరకు ఎంతో మంది చెప్పారు.. ప్రతి ఒక్కరు కూడా ఒకే తరహా లో చెప్పుకొచ్చారు. ప్రభాస్ చిన్న పిల్లాడి మనస్థత్వం.. అతడితో ఉంటే మర్యాదలతో మతులు పోగొట్టేస్తాడు.. ప్రతి నిమిషం కూడా చిల్ అంటూ తన చుట్టు ఉన్న వారిని కూడా నవ్విస్తూ ఉంటాడు. ప్రభాస్ డైరెక్టర్ నుండి లైట్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరిని ఒకే తరహా గౌరవంతో పిలుస్తాడు. తాను ఎంత పెద్ద స్టార్ అయినా కూడా ప్రతి ఒక్కరిని గౌరవించడం ఆయన నైజం అంటూ ఆయనతో వర్క్ చేసిన పలువురు చెప్పుకొచ్చారు. ఆయన ఇంటి నుండి తెప్పించిన వంటలను రుచి చూసిన వారు ఖచ్చితంగా ఆహా అనాల్సిందే. తాజాగా ప్రభాస్ కు ఫిదా అయిన వారిలో హీరోయిన్ శృతి హాసన్ కూడా చేరింది.ప్రస్తుతం ప్రభాస్ తో కలిసి సలార్ సినిమా లో శృతి హాసన్ నటిస్తున్న విషయం తెల్సిందే. కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సలార్ సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరింది. అన్ని అనుకున్నట్లుగా జరిగి ఉంటే మొన్న సంక్రాంతికి ఈసినిమా విడుదల అయ్యి ఉండేది. కాని కరోనా వరుస వేవ్ లు సినిమా ను ముందుకు సాగనివ్వడం లేదు. ప్రభాస్ తో ఇప్పటికే కీలక సన్నివేశాల చిత్రీకరణ లో పాల్గొన్న శృతి హాసన్ మరో షెడ్యూల్ ను కూడా చేయాల్సి ఉంది. ప్రభాస్ తో శృతి హాసన్ స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పుకొచ్చింది. ముందు ముందు మా ఇద్దరి కాంబో ను సలార్ లో ప్రేక్షకులు చూసి ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారంటూ చెప్పుకొచ్చింది. తాజాగా పుట్టిన రోజు జరుపుకున్న శృతి హాసన్ ఆ సందర్భంగా ఒక మీడియా సంస్థకు బర్త్ డే స్పెషల్ ఇంటర్వ్యూ ఇచ్చింది. ఆ ఇంటర్వ్యూలో పలు విషయాలను శృతి హాసన్ వెల్లడించింది. ప్రభాస్ తో వర్క్ ఎక్స్ పీరియన్స్ గురించి శృతి హాసన్ ప్రత్యేకంగా వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది.






# రవితేజ పాన్ ఇండియా చిత్రంలో రేణూ దేశాయ్..?

మాస్ మహారాజా రవితేజ "టైగర్ నాగేశ్వరావు" అనే పాన్ ఇండియా మూవీ చేయనున్న సంగతి తెలిసిందే. 'దొంగాట' ఫేమ్ వంశీ కృష్ణ దర్శకత్వంలో ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. 1970 లలో స్టువర్ట్ పురంలో పేరువోసిన గజదొంగ నాగేశ్వరరావు బయోపిక్ గా ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రముఖ నటీనటులు - అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ లో భాగం కానున్నారు. అయితే ఇందులో ఓ కీలకమైన పాత్ర కోసం రేణుదేశాయ్ ని సంప్రదిస్తున్నారని టాక్ వినిపిస్తోంది.'టైగర్ నాగేశ్వరావు' చిత్రంలో రవితేజ సోదరి పాత్ర కోసం రేణు దేశాయ్ ని తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారట. ఇప్పటికే ఈ విషయమై దర్శకనిర్మాతలు ఆమెను సంప్రదించగా.. ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదట. 'జానీ' సినిమా తర్వాత నటనకు దూరంగా ఉన్న రేణు దేశాయ్.. ఆ మధ్య మళ్ళీ కెమెరా ముందుకు వచ్చారు. 'ఆద్య' అనే పవర్ ఫుల్ లేడి ఓరియెంటెడ్ వెబ్ సిరీస్ తో సెకండ్ ఇన్నింగ్స్ కి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రవితేజ సినిమాలో రేణూ భాగం అవుతారో లేదో చూడాలి.కాగా 'టైగర్ నాగేశ్వరావు' చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ పై అభిషేక్ భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. ఇది రవితేజ కెరీర్ లో ఫస్ట్ పాన్ ఇండియా మూవీ. తెలుగు తమిళ కన్నడ



మలయాళ హిందీ భాషల్లో ఒకే టైటిల్ తో విడుదల కానుంది. 70వ దశకంలో పోలీసులను ముచ్చెమటలు పట్టించిన మోస్ట్ వాంటెడ్ స్టువర్టుపురం దొంగ నాగేశ్వరరావు జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. రవితేజను దృష్టిలో పెట్టుకొని ఈ కథను రాబిన్ హుడ్ తరహాలో తీర్చిదిద్దుతున్నారని సమాచారం

# ఆర్సీబీతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనైన కోహ్లి



ఫిబ్రవరి 12, 13 తేదీల్లో జరగబోయే ఐపీఎల్ మెగా వేలానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ఓ వినూత్న కార్యక్రమం చేపట్టింది. పాత జట్టులోని కొందరు సభ్యులతో ఓ పాడ్కాస్ట్ షోను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆ జట్టు మాజీ సారథి విరాట్ కోహ్లి, ఏబీ డివిలియర్స్, మహ్మద్ సిరాజ్, యుజ్వేంద్ర చహల్, దేవదత్ పడిక్కల్, గ్లెన్ మ్యాక్స్వెల్ తదితర ఆటగాళ్లు పాల్గొని జట్టుతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విరాట్ కోహ్లి మాట్లాడుతూ.. లీగ్ తొలి సీజన్లో(2008) జట్టుకు ఎంపికైన నాటి భావోద్వేగ క్షణాలను గుర్తు చేసున్నాడు. ఐపీఎల్ తొలి వేలం జరిగే సమయానికి తాను అండర్-19 ప్రపంచకప్ కోసం మలేషియాలో ఉన్నానని, నా కోసం బెంగళూరుతో పాటు ఢిల్లీ ఫ్రాంచైజీ పోటీ పడిన విషయాన్ని ఇప్పటికీ మరవలేకపోతున్నానని భావోద్వేగానికి లోనయ్యాడు. నాడు వేలంలో బెంగళూరు జట్టు తనను దాదాపుగా రూ. 25 లక్షలకు(30000 డాలర్లు) సొంతం చేసుకుందని, ఆర్సీబీ తన కోసం అంత భారీ మొత్తం వెచ్చిస్తుందని అస్సలు ఊహించలేదని, ఆ సమయంలో అంత డబ్బును ఊహించుకుని చాలా క్రేజీగా ఫీలయ్యానని గుర్తు చేసున్నాడు. అగ్రిమెంట్ పేపర్లపై సంతకం చేసిన రోజు తనకింకా గుర్తుందని, టీమిండియాకు ఆడితే కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి తనకు అప్పుడే తెలిసిందని తెలిపాడు. నాడు తన కోసం ఢిల్లీ ఫ్రాంచైజీ సైతం పోటీపడినప్పటికీ.. వారికి బౌలర్ల అవసరత ఉండడంతో ప్రదీప్ సాంగ్వాన్ వైపు మొగ్గు చూపారని గుర్తు చేసుకున్నాడు. కాగా, విరాట్ కోహ్లి.. ఐపీఎల్ తొలి సీజన్ నుంచి ఆర్సీబీ మినహా మరే ఇతర జట్టుకు ప్రాతనిధ్యం వహించలేదు. 2008 నుంచి 2012 దాకా ఆర్సీబీలో సాధారణ ఆటగాడిలా కొనసాగిన కోహ్లి.. 2013 నుంచి 2021 సీజన్ వరకు సారథిగా వ్యవహరించాడు. ఆ సీజన్ తర్వాత కెప్టెన్సీని వదులుకున్న కోహ్లిని.. ఆర్సీబీ 15వ ఎడిషన్ కోసం 15 కోట్లకు డ్రాఫ్ట్ చేసుకుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190